క్లుప్తంగా

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం



కాలనీవాసులతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపాలిటీలోని అన్ని కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి తెలిపారు. మున్సిపల్ పరిధిలోని టైలర్స్ కాలనీలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఆయన కాలనీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్టీసీ కాలనీలో రూ.40లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న అంతర్గత మురుగునీటి కాలువల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి, కౌన్సిలర్లు మహదేవరెడ్డి, యూసుఫ్, సీనియర్ నాయకులు చంద్రశేఖర్, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు



బ్లీచింగ్ చల్లుతున్న కార్మికులు

జిన్నారం(పటాన్‌చెరు): ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి తెలిపారు. బొల్లారం మున్సిపల్ పరిధిలోని ఆయావార్డుల్లో ఎంఎల్‌ఓ అయిల్, బ్లీచింగ్ చల్లే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్, కౌన్సిలర్‌లు గోపాలమ్మ, సంతోష తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న నాయకులు

నారాయణఖేడ్: మండల పరిధిలోని జూకల్ శివారులోని డబుల్ బెడ్ రూం ఇళ్ల సమీపంలో నిర్మిస్తున్న దొడ్డి కొమురయ్య కమ్యూనిటీ భవన నిర్మాణ పనులను ఆదివారం ఏతః రమేష్, ఖేడ్ నియోజకవర్గ కురుమ సంఘం అధ్యక్షుడు జీఎస్ ప్రభాకర్, ఉపాధ్యక్షుడు మల్గొండ పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.5లక్షలు మంజూరు చేసిందని తెలిపారు.

27న కలెక్టరేట్‌ను ముట్టడిస్తాం



మాట్లాడుతున్న మహిపాల్

ఝరాసంగం(జహీరాబాద్): గ్రామ పంచాయతీలలో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ ఉద్యోగ, కార్మికుల సమస్యలు పరిష్కరించని పక్షంలో 27న కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని సీఐటీయూ నియోజకవర్గం అధ్యక్షుడు మహిపాల్ హెచ్చరించారు. మండల కేంద్రంలో కొనసాగుతున్న పంచాయతీ ఉద్యోగ కార్మికుల సమ్మెకు ఆదివారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మికులకు కనీసం వేతనం రూ.26000 అందించాలని డిమాండ్ చేశారు.

28న పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లు

నారాయణఖేడ్: ఖేడ్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 28న నిర్వహించనున్న స్పాట్ అడ్మిషన్స్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ మల్లయ్య ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 25న ఉదయం 10గంటలకు కళాశాలలో ఖాళీల వివరాలను తెలుపుతామన్నారు. ఈ నెల 25నుంచి 27వ తేదీ సాయంత్రం 4గంటల వరకు అవసరమైన ధ్రువపత్రాలను జతచేస్తూ కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. స్పాట్ అడ్మిషన్ రోజు అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలతో అడ్మిషన్ ఫీజుగా రూ.5,080 తీసుకుని ఉదయం 9గంటలకు కళాశాలకు హాజరు కావాలన్నారు. 28న ఉదయం 10గంటలకు స్పాట్‌అడ్మిషన్‌కు కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందని తెలిపారు.

పార్కింగ్ పేరుతో కబ్జాలు

- ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తున్న పరిశ్రమల యాజమాన్యాలు
- నిబంధనలకు విరుద్ధంగా షెడ్ల నిర్మాణం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



గడ్డపోతారం పారిశ్రామికవాడలోని ఓ పరిశ్రమ ఎదురుగా పార్కింగ్

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని పరిశ్రమల యాజమాన్యాలు పార్కింగ్ పేరుతో విలువైన ప్రభుత్వ స్థలాలను యథేచ్ఛగా కబ్జా చేస్తున్నాయి. ఏళ్ల కాలం నుంచి ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తూ పార్కింగ్‌ను ఏర్పాటు చేసుకుంటున్నా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. బొల్లారం, ఖాజీపల్లి, గడ్డపోతారం పారిశ్రామికవాడల్లో 200పైగా పరిశ్రమలు ఉంటాయి. వీటిల్లో 10,000వేలకు పైగా కార్మికులు వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తుంటారు. ఈ నేపథ్యంలో పరిశ్రమల్లో విధులు నిర్వహించే కార్మికుల వాహనాలకు ఆయా పరిశ్రమల యాజమాన్యాలు పార్కింగ్ సౌకర్యం కల్పించకపోవడం లేదు. దీంతో పరిశ్రమల ఎదురుగా ఉన్న ప్రభుత్వ స్థలాలు, రోడ్ల పక్కనే వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ఇతర వాహనాలు వెళ్లే సమయంలో తీవ్ర ట్రాఫిక్ అంతరాయం కలుగుతోంది. ఇలా ప్రతిరోజు వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ఇదే అదునుగా పరిశ్రమల యాజమాన్యాలు యథేచ్ఛగా ఈ స్థలాలను కబ్జాలు చేస్తున్నాయి.

నిబంధనలకు విరుద్ధంగా షెడ్ల ఏర్పాటు

రోడ్లు, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించడమే కాకుండా నిబంధనలకు విరుద్ధంగా షెడ్లను ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వ, గ్రామకంఠం స్థలాలు కబ్జాకు గురవుతున్నా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడంతో పరిశ్రమ యాజమాన్యాలకు తొత్తులుగా మారుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కబ్జాలకు గురవుతున్న ప్రభుత్వ స్థలాలను రక్షించేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

నోటీసులు అందిస్తున్నాం

ప్రభుత్వ స్థలాలు, రోడ్లను ఆక్రమించి పార్కింగ్ చేస్తున్న పరిశ్రమల యాజమాన్యాలకు నోటీసులు అందజేస్తున్నాం. నిబంధనలకు విరుద్ధంగా షెడ్లు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే కొన్ని పరిశ్రమల యాజమాన్యాలకు నోటీసులు అందజేశాం.

– నరేష్, ఈఓ, గడ్డపోతారం

అధికారులకు ఫిర్యాదు చేశాం



జిన్నారం (పటాన్‌చెరు): పారిశ్రామికవాడల్లో రోడ్ల పక్కనే పార్కింగ్ చేస్తున్న విషయాన్ని చాలాసార్లు అధికారులకు ఫిర్యాదు చేశాం. అయినా పట్టించుకోవడంలేదు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి పార్కింగ్‌కు వినియోగిస్తున్న యాజమన్యాలపై చర్యలు తీసుకోవాలి. ఈ విషయంలో ఆందోళన కార్యక్రమాలను చేపడతాం.

– రాజయ్య, సీఐటీయూ జిల్లా నాయకుడు

చర్యలు తీసుకోవాలి



రోడ్ల పక్కన ఇష్టం వచ్చినట్లు పార్కింగ్ చేస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కార్లు, బైక్‌లు ఇష్టారీతిన పార్కింగ్ చేస్తున్నారు. రోడ్డుపై ఎదురెదురుగా వస్తున్న వాహనాల రాకపోకలతో ట్రాఫిక్ అంతరాయం కలుగుతోంది. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– భాస్కర్‌రెడ్డి, కార్మికుడు, ఖాజీపల్లి

మృతుడి కుటుంబాన్ని ఆదుకుంటాం

ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

పుల్‌కల్(అందోల్): మండల పరిధిలోని బస్వాపూర్ గ్రామానికి చెందిన చింతల ప్రతాప్ ఇటీవల ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కేజ్‌వీల్ కిందపడి మృతి చెందిన విషయం విదితమే.. దీంతో బాధితుడి కుటుంబాన్ని ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబాన్ని అన్నివిధాలుగా ఆదుకుంటామని తెలిపారు.

వట్‌పల్లి డిప్యూటీ తహసీల్దారు బదిలీ

వట్‌పల్లి(అందోల్): వట్‌పల్లి తహసీల్దారు కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారుగా విధులు నిర్వహిస్తున్న శంభిరెడ్డి జిల్లా కేంద్రమైన సంగారెడ్డి తహసీల్దారు కార్యాలయానికి బదిలీ అయినట్లు తెలిసింది. ఈనెల 22న శనివారం బదిలీ ఉత్తర్వులు వెలువడినట్లుగా సమాచారం. డిప్యూటీ తహసీల్దారుగా విధులు నిర్వహిస్తూ అదనపు బాధ్యతలతో ఇంచార్జీ తహసీల్దారుగా కొనసాగుతున్న ఆయన బదిలీపై ఒకటి రెండు రోజుల్లో వెళ్లనున్నారు. సంగారెడ్డి తహసీల్దారు కార్యాయంలో డిప్యూటీ తహసీల్దారుగా విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ తహసీల్దారు నరేందర్ బదిలీపై వట్‌పల్లి డిప్యూటీ తహసీల్దారుగా రానున్నట్లు తెలిసింది.

బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలి



మాట్లాడుతున్న రమేశ్

జిన్నారం(పటాన్‌చెరు): రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలకు ఎమ్మెల్యే, ఎంపీ సీట్లను కేటాయించాలని ముదిరాజ్ సంఘం మండల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం జిన్నారంలో ముదిరాజ్ సంఘం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు సుంకరబోయిన మహేష్, మున్ని నర్సింలు మాట్లాడుతూ పటాన్‌చెరు నియోజకవర్గంలో బీసీలు ఎక్కువ సంఖ్యలో ఉన్నారన్నారు. వీరిని దృష్టిలో పెట్టుకొని అన్ని వర్గాల ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండే చిట్కుల్ సర్పంచ్ నీలం మధుకు ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ముదిరాజ్ సంఘం స్థానిక నాయకులు వెంకటేశ్, పర్వతాలు, భిక్షపతి, నీలం సత్యనారాయణ, కావలి శేఖర్, రమేశ్, ఎల్లయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యే, ఎంపీ టికెట్లు ఇవ్వాలి

సంగారెడ్డి మున్సిపాలిటీ: జిల్లాలో ముదిరాజ్‌లకు రెండు ఎమ్మెల్యే, ఒక ఎంపీ సీట్లు కేటాయించాలని ముదిరాజ్ మహాసభ సంగారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి పిట్టల రమేశ్ డిమాండ్ చేశారు. ఆదివారం సంగారెడ్డిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి ముదిరాజ్‌లు బీఆర్‌ఎస్‌లో కీలక పాత్ర పోషిస్తున్నందునా జనాభా దామాషా ప్రకారం ఎన్నికల్లో సరైన అవకాశాలు రావడంలేదన్నారు. ప్రభుత్వం స్పందించి ఉమ్మడి మెదక్ జిల్లాలో రెండు ఎమ్మెల్యే, ఒకటి ఎంపీ టికెట్లు ఇవ్వాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి కొత్లాపూర్ శ్రీనివాస్, నాయకులు చందు, బొట్టు వెంకన్న, తిర్మల్‌రావు, రామకృష్ణ, భూమయ్య పాల్గొన్నారు.

ముదిరాజులకు ప్రాతినిధ్యం కల్పించాలి

వట్‌పల్లి(అందోల్): వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ముదిరాజులకు ప్రాతినిధ్యం కల్పించాలని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నాగభూషణం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో ముదిరాజులు అధిక జనాభా కలిగి ఉన్నప్పటికీ ఒక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీకి మాత్రమే పరిమితం కావటం బాధాకరమన్నారు. ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వాలు బీసీలకు సరిగా గుర్తింపును ఇవ్వడం లేదని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉమ్మడి మెదక్ జిల్లాల నుంచి జిల్లాకు కనీసం రెండు అసెంబ్లీ సీట్లు, పార్లమెంట్ సీటు కేటాయిచాలని కోరారు.

ఆందోళన వద్దు.. అండగా ఉంటాం

- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి
- మహిళా కార్మికులకు భరోసా



మహిళా కార్మికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: డివిజన్ పరిధిలో ఇటీవల మూతపడిన ఇంపీరియల్ గార్మెంట్స్ పరిశ్రమ మహిళా కార్మికులకు ఈఎస్‌ఐ నుంచి రావాల్సిన బకాయిలను ఇప్పించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి హామీనిచ్చారు. ఆదివారం పరిశ్రమ మహిళా కార్మికులు ఎమ్మెల్యేను కలిసి తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమ మూసివేసినప్పటికీ ప్రతి కార్మికురాలికి రూ.3లక్షలకు పైగా పరిహారం అందజేశామని గుర్తు చేశారు. కార్మికులు ఆధైర్యపడొద్దని భరోసానిచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి యాదగిరియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

పటాన్‌చెరు టౌన్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లో మాస్టర్లు రమేష్, సురేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తెలంగాణ రాష్ట్ర స్థాయి ద్వితీయ కరాటే ఛాంపియన్ షిప్ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా రంగానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అందులో భాగంగానే ప్రభుత్వం ప్రతి గ్రామంలో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసి క్రీడాకారులను ప్రోత్సహిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతులు చేపడతాం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రోడ్ల మరమ్మతులకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో నైబర్ హుడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గ్రేటర్ కమ్యూనిటీ కాలనీవాసులతో శనివారం ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉస్మాన్‌నగర్ నుంచి గోపనపల్లి, తెల్లాపూర్ నుంచి ఉస్మాన్‌నగర్ వరకు చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లలిత, వైస్‌చైర్మన్ రాములగౌడ్, కమిషనర్ శ్రీనివాస్, కౌన్సిలర్లు లచ్చిరాంనాయక్, చిట్టి, శ్రీశైలం, కొల్లూర్ ఈఐ సంజయ్, తెల్లాపూర్ నైబర్ హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వరగారి రమణ పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



సదాశివపేట పట్టణంలో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళా సంఘాల బాధ్యులు

సదాశివపేట(సంగారెడ్డి): మణిపూర్ అత్యాచార నిందితులకు ఉరిశిక్ష విధించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి వినోద డిమాండ్ చేశారు. అత్యాచార ఘటనను ఖండిస్తూ ఆదివారం పట్టణంలో సీపీఐ, మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వినోద మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, దాడులకు బాధ్యత వహిస్తూ మణిపూర్ సీఎం వెంటనే రాజీనామా చేయాలన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలపై దాడులు పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్రం జోక్యం చేసుకొని మణిపూర్‌లో జరుగుతున్న జాతి వైరుధ్యాన్ని తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళా నాయకులు ఆదిలక్ష్మి, బుజ్జమ్మ సుమిత్ర, రాధాబాయి, కంసమ్మ, రాజమ్మ, దేవిభాయ్, రాధిక, నర్సమ్మ, నాగలక్ష్మి, మాధవి, బిపాషా బేగం పాల్గొన్నారు.

ఐద్వా ఆధ్వర్యంలో...

జహీరాబాద్ టౌన్: మణిపూర్‌లో మహిళలపై అత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జహీరాబాద్ డివిజన్ అధ్యక్షురాలు, కార్యదర్శి పూలమ్మ, శ్వేత డిమాండ్ చేశారు. పట్టణంలోని శ్రామిక్ విజ్ఞాన కేంద్రంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల రక్షణలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించి, హత్యాచారం చేసి దారుణంగా హత్య చేయడం సభ్య సమాజానికి సిగ్గుచేటన్నారు. సంఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం దాడుల్లో మృతి చెందిన వారికి కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. ఐద్వా నాయకులు రాణి, భారతి, మీనా పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

జహీరాబాద్: సామాజిక సేవలందించడంలో రోటరీ క్లబ్ ముందంజలో ఉందని జిల్లా నామినీ గవర్నర్ ఎస్‌వి రామప్రసాద్ అన్నారు. శనివారం రాత్రి జహీరాబాద్‌లోని సిద్ధి హోటల్‌లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జహీరాబాద్ నియోజకవర్గం రోటరీ నూతన అధ్యక్షుడిగా సంగ్రామ్ పాటిల్, కార్యదర్శిగా వెంకటేశం, కోశాధికారిగా రఘునందన్‌రెడ్డి ఎన్నికయ్యారు. కేతకీ ఆలయ చైర్మన్ వెంకటేశం గుప్తా, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు. నూతనంగా శ్యాంరావు పాటిల్, వసంత్‌రావుపాటిల్, లక్ష్మణ్, వెంకటేశంలను క్లబ్‌లో చేర్చుకున్నారు.

ఘనంగా పోచమ్మతల్లి బోనాలు



అమ్మవారి సన్నిధిలో నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని అన్నారం గ్రామంలో ఆదివారం పోచమ్మతల్లి బోనాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు, స్థానిక సర్పంచ్ మురళి అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గోదావరి అమ్మవారికి పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు చర్యలు తీసుకున్నారు.

ఎస్‌ఐకి సన్మానం

మనూరు(నారాయణఖేడ్): మండలానికి ఎస్‌ఐగా వచ్చిన మూడ్ అంబ్రయ్యను ఆదివారం నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు మాజీ సర్పంచ్‌లు డిగంబర్‌రెడ్డి, బ్రహ్మానందారెడ్డి, మాజీ జెడ్పీటీసీ రూప్‌సింగ్, చందర్ నాయక్, సాయిలుపటేల్, నాయకులు నెహ్రూనాయక్, అశోక్‌రెడ్డి, మతిన్, రాజుయాదవ్, గుత్తి రమేశ్ తదితరులు ఘనంగా సన్మానించారు.

సీఐ విజయకృష్ణకు సన్మానం

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల ఎస్‌ఐగా విధులు నిర్వహించిన విజయకృష్ణ ఇటీవల సీఐగా పదోన్నతి పొందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా గుమ్మడిదల జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు హుస్సేన్ ఆధ్వర్యంలో సీఐ విజయకృష్ణను ఆదివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఘనంగా బీఎంఎస్ ఆవిర్భావ దినోత్సవం

రామచంద్రపురం (పటాన్‌చెరు): బీఎంఎస్ 69వ ఆవిర్భావ దినోత్సవాన్ని బెల్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బెల్ జేఎస్‌సీ మెంబర్ అంగుస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనని మాట్లాడుతూ బీఎంఎస్ దేశంలోనే అత్యధిక సభ్యతం కలిగిన ట్రేడ్ యూనియన్‌ని తెలిపారు. కార్యక్రమంలో బీఎంఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

◆ దివ్యాంగులకు సీఎం కేసీఆర్ భరోసా

పటాన్‌చెరు: దివ్యాంగులకు ఫించన్ మొత్తాన్ని రూ.4016కు పెంచుతూ ప్రభుత్వం జీఓ జారీ చేయడంపై ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సీఎం కేసీఆర్‌కు ఆదివారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటికే 300 మందికి పైగా దివ్యాంగులకు రూ.3కోట్లతో స్కూటీలు అందించినట్లు గుర్తు చేశారు.

◆ 28న ఉచిత వైద్యశిబిరం

మనూరు(నారాయణఖేడ్): నాగల్‌గిద్ద మండల కేంద్రంలో ఈ నెల 28న విగ్రాం రామగౌడ్ పీపుల్స్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ట్రస్టు సభ్యులు అంజాగౌడ్, శంకర్‌గౌడ్, రాజు, క్రిష్టాగౌడ్, సిద్దు అన్నారు. ఈ మేరకు ఆదివారం మండల పరిధిలోని ఉట్‌పల్లి, ఎనక్‌పల్లి తదితర గ్రామాల్లో వైద్యశిబిరానికి సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు.

◆ ఆత్మగౌరవ ఆకాంక్షను వినిపించాలి

జహీరాబాద్ టౌన్: ఎస్సీ వర్గీకరణ ఉద్యమం చివరి దశలో ఉందని మాదిగల ఆత్మగౌరవ ఆకాంక్షను కేంద్ర ప్రభుత్వానికి బలంగా వినిపించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బొర్రా భిక్షపతి అన్నారు. ఆదివారం ఆయన జహీరాబాద్‌కు వచ్చిన సందర్భంగా ముఖ్య నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వచ్చే నెల ఆగస్టు రెండో వారంలో హైదరాబాద్ నగరంలో నిర్వహించే మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా కన్వీనర్ అబ్రహం, కోకన్వీనర్ మాతంగి చిరంజీవి, జహీరాబాద్ కన్వీనర్ జయరాజ్, మండల నాయకులు ఉల్లాస్, నర్సింహులు, సుకుమార్, బబ్లూ, కిట్టు, మనోజ్, జనార్ధన్, వినయ్ పాల్గొన్నారు.

◆ రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల నుంచి కానుకుంట వరకు చేపడుతున్న రోడ్డు విస్తరణ పనులను ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గోదావరి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్డు పనులు ప్రారంభించి ఏడాది గడుస్తున్నా నేటికీ పూర్తి కాకపోవటం విచారకరమన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు రాజిరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, రాఘవరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

◆ భక్తిభావం కలిగి ఉండాలి

జహీరాబాద్ టౌన్: ప్రతిఒక్కరూ భక్తిభావం కలిగి ఉండాలని వక్తలు అభిప్రాయపడ్డారు. పట్టణంలోని పద్మశాలి భవనం వద్ద ఆదివారం నిర్వహించిన నగర సంకీర్తనలో పలువురు వక్తలు మాట్లాడుతూ ఉరుకుల పరుగుల జీవితంలో మనశాంతిని దూరం చేసుకుంటున్నారన్నారు. అనంతరం నగర సంకర్తీనలో భాగంగా పట్టణ ప్రజలు భజనలు, కీర్తనలు చేసుకుంటూ పాదయాత్ర నిర్వహించారు.

◆ మంత్రి కేటీఆర్ జన్మదిన గీతం ఆవిష్కరణ

పటాన్‌చెరు: ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ జన్మదినం పురస్కరించుకొని ప్రముఖ గాయకుడు నల్లగొండ నరసన్నచే ప్రత్యేకంగా రూపొందించిన గీతాన్ని ఆదివారం ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ఆవిష్కరించారు. అమీన్‌పూర్ జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ యాదగిరియాదవ్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

◆ ఆలయంలో కార్పొరేటర్ పూజలు

రామచంద్రపురం(పటాన్‌చెరు): భారతినగర్ డివిజన్ పరిధిలోని ఎల్‌ఐజీ కాలనీ పంచముఖి హనుమాన్ దేవాలయంలో శనివారం కార్పొరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీదత్త విజయానంద తీర్థ స్వామీజీ ఆశీర్వాదం తీసుకున్నారు.

◆ కాంగ్రెస్‌లో చేరికలు

నారాయణఖేడ్: ఖేడ్‌లోని టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి స్వగృహంలో ఆదివారం కంగ్టి మండలంలోని తడ్కల్‌కు చెందిన 20మంది యువకులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి చంద్రశేఖర్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. మున్సిపల్ కాంగ్రెస్ ఉప ఫ్లోర్ లీడర్ దారం శంకర్, కంగ్టి మాజీ ఎంపీపీ శాదుల్లా, ఖేడ్ నియోజకవర్గ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు అవుటి శంకర్, నాయకులు సుధాకర్‌రెడ్డి, యాదవరెడ్డి, మనోహర్, అర్జున్, ఖాజామియా, ఆరీఫ్, నగేష్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

◆ రహదారికి మరమ్మతులు

ఝరాసంగం(జహీరాబాద్): మండల పరిధిలోని ప్యారవరం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి బోపన్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలో రహదారి ఇటీవల కురిసిన వర్షానికి బురదమయంగా మారింది. దీంతో సర్పంచ్ సంజీవమ్మ చొరవతో రోడ్డుపై మట్టి వేసి మరమ్మతులు చేయించారు. ఉపసర్పంచ్ మాణిక్యం యాదవ్ పనులను పర్యవేక్షించారు.

◆ కూలిన ఇళ్ల వివరాల సేకరణ

మునిపల్లి(అందోల్): ఎడతెరిపి లేకుండా పడుతున్న వర్షాలకు కూలిన ఇళ్ల వివరాలను సేకరిస్తున్నట్లు ఆర్‌ఐ రవీందర్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఇప్పటివరకు 16 శిథిలావస్థలో ఉన్న ఇళ్లు కూలిపోయినట్లు చెప్పారు. మిగతా కొన్ని గ్రామాల్లో కూలిన ఇళ్ల వివరాలను సేకరించాల్సి ఉందన్నారు.

◆ ఆర్థిక సాయం

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని అన్నారం గ్రామానికి చెందిన నీలాంబర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి బీఆర్‌ఎస్ నేత మధుసూదన్‌రెడ్డి రూ.10వేల ఆర్థికసాయాన్ని ప్రకటించారు. ఇందుకు సంబంధించిన నగదును ఆదివారం సర్పంచ్ మురళి మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.

◆ విద్యార్థికి సన్మానం



హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని గుండ్ల మాచినూర్ గ్రామానికి చెందిన నలుగుల్లాగ్ నితీష్ మార్ ఐఐటీకి ఎంపిక కావడంతో ఆదివారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కర్రె కృష్ణ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి నర్సింహరెడ్డి, జగన్‌యాదవ్, శశిధర్‌రెడ్డి, ఆంజనేయులు జస్వంత్, శ్రీకాంత్, రామస్వామి, కొమురయ్య, ప్రసాద్, కృష్ణ పాల్గొన్నారు.